సుద్దపూస మాటలొద్దు

మేడిగడ్డను పరిశీలిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

- నల్లగొండకు కాదు.. ముందు అసెంబ్లీకి రండి
- బిఆర్‌ఎస్ అవినీతికి బిజెపి కొమ్ము కాస్తోంది
- మేడిగడ్డలో నిర్మాణ లోపంతోపాటు, నిర్వహణ లోపం ఉంది
- కుంగిన పిల్లర్లను పరిశీలించిన ప్రజాప్రతినిధుల బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

" కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన అవినీతిని కక్కిస్తాం. రెవెన్యూ యాక్ట్ ప్రకారం నిధులను రికవరీ చేస్తాం. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ నల్లగొండకు పోవడం కాదు... ముందు అసెంబ్లీకొచ్చి ప్రజల తరపున సమస్యలపై మాట్లాడాలి. సుద్దపూస లాగా బయట కూర్చొని మాట్లాడొద్దు" అని మాజీ సిఎం కెసిఆర్‌కు సిఎం రేవంత్‌రెడ్డి చురకలు అంటించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లోని మేడిగడ్డ, అన్నారం సుందిళ్ల, బ్యారేజీలపై బిఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కుట్రలను తిప్పికొట్టాలని ప్రజలు, కవులు, కళాకారులకు పిలుపునిచ్చారు. కెసిఆర్ అవినీతికి కొమ్ముకాస్తున్న బిజెపిని సైతం తిరస్కరించాలని కోరారు. ప్రాజెక్టుల్లో బిఆర్‌ఎస్ అవినితిపై బిజెపి వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఆ రెండు పార్టీలు చీకటి మిత్రులని విమర్శించారు. కాళేశ్వరంపై సభలో చర్చకు రాకుండా నల్లగొండలో మీటింగ్ పెట్టడాన్ని ఖండించారు. సమస్యలపై చర్చించ కుండా పార్లమెంట్ ఎన్నికల కోసం ఓట్లడుక్కోవడానికి ఆయన వెళ్లారని ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై బిఆర్‌ఎస్ పార్టీ వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. కుర్చీ వెతుక్కుంటూ నల్లగొండకు వెళ్లటం సిగ్గు చేటని అన్నారు. మేడిగడ్డ ఏ క్షణమైనా కుప్పకూలే ప్రమాదముందంటూ విజిలెన్స్, రిపోర్టు చెబుతుందనీ, అన్ని పాపాలకు కెసిఆర్ కారణమని విమర్శించారు. మంగళవారం శాసనసభ సమావేశాల వాయిదా అనంతరం సిఎం రేవంత్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ప్రత్యేక బస్సుల్లో మేడిగడ్డ బ్యారేజిని సందర్శించారు. సిపిఐ, ఎంఐఎం, ఎమ్మెల్యేలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కె.నర్సిరెడ్డి ఇతరులు సైతం అక్కడికి సిఎంతో పాటు వెళ్లారు. ప్రభుత్వం ఆహ్వానించినప్పటికి బిఆర్‌ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం మేడిగడ్డను ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి కలియతిరిగారు. బ్యారేజీకి సంబంధించి కుంగుబాటుకు గురయిన అన్ని పిల్లర్లు, స్పిల్‌వేలను పరిశీలించారు. అధికారులతో సందేహాలను నివృత్తి చేసుకున్నారు. బ్యారేజీపైనే కాకుండా కిందకూడా పరిస్థితిని అవగాహన చేసుకున్నారు. తీవ్రంగా దెబ్బతిన్న 19,20,21,22,పిల్లర్లను అసాంతం ఆయన పరిశీలించారు. అనంతరంస్థానిక ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, మీడియాతో కలిపి అదే అంశంపై రెండు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. ఇందులో సాగునీటి శాఖ ఇంజినీర్లు, మేడిగడ్డకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్ సైతం తన విచారణ నివేదికను పవర్ పాయింట్ రూపంలో చెప్పారు. సిఎం, మంత్రులు, అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. అనంతరం సిఎం మాట్లాడు తూ...నిర్మాణంలో నాణ్యతాలోపం ఉందని డ్యాం సేఫ్టీ అథారిటీ చెప్పినప్పటికీ, సమస్యను సరిదిద్దకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రాజెక్ట్ నిర్వహణకు ఏటా విద్యుత్ బిల్లులు రూ.10,500 కోట్లు ఇతర నిర్వహణ ఖర్చులు కలిపి ఏటా దాదాపు రూ. 25 వేల కోట్లు చెల్లించే పరిస్థితి ఏర్పడిందని ఆందోళనల వ్యక్తం చేశారు. సాంకేతిక నిపుణులతో చర్చించిన తర్వాత మేడిగడ్డ పునర్నిర్మాణంపై మా నిర్ణయం చెబుతామన్నారు. అక్రమాలకు బాధ్యులపై విచారణ కొనసాగుతోందనీ, అవసరమైతే రెవెన్యూ యాక్ట్‌తో సొమ్ము రికవరీ చేస్తామని అన్నారు. మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎం చేయాలో సలహాలు, సూచలను ఇవ్వాలని కోరారు. తెలంగాణ కోసం చావు నోట్లో తల పెట్టిన ఆయన మేడిగడ్డపై సుద్దపూస లెక్కలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ. లక్ష కోట్లు ఖర్చు పెటారనీ, కొత్త ఆయకట్టు సృష్టించింది మాత్రం 90 వేల ఎకరాలేనని వివరించారు. కానీ కెసిఆర్ మాత్రం కోటి ఎకరాలకు నీరిచ్చామంటూ పచ్చి అబద్దాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలు విరిగిన కెసిఆర్ కూత వేటు దూరంలో ఉన్న అసెంబ్లీకి రాకుండా నల్లగొండకు ఎలా వెళ్లారని ప్రశ్నించారు. ప్రజలకు అవగాహన లేదని అనుకుంటున్నారనీ, కానీ వాళు గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. కెసిఆర్ అవినీతికి దోపిడికి మేడిగడ్డ బలైందని విమర్శించారు. అసెంబ్లీలో పెట్టిన తీర్మాణం సరిగ్గా లేదని మామ అళ్లుల్లు బయట చెప్పడం కాదనీ, సభకు వచ్చి తీర్మానాన్ని సవరించాలని సూచించారు. ఢిల్లీకి అఖిల పక్షాన్ని తీసుకెళ్లాలని అడుగుతున్నారనీ, ముందు ప్రజలు ఎన్నుకున్న సభకు వచ్చి మాట్లాడాలని సూచించారు. ఎన్నికల ముందే నీ సంగతి ప్రజలకు తెలిసుంటే ప్రతిపక్ష హోదాకూడా వచ్చుండేది కాదని వ్యాఖ్యానించారు. సిపిఐ శాసన సభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ.. మేడిగడ్డ బ్యారేజి పగుళ్లను.. తెలంగాణ ప్రజల గుండెల పగుళ్లని వ్యాఖ్యానించారు. దేశంలోనే కాళేశ్వరం పెద్ద కుంభకోణమని విమర్శించారు. మేడిగడ్డతో పాటు సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు ప్రమాదం పొంచి ఉన్నదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి తలెత్తడానికి కాళేశ్వరం అవినీతేనని గుర్తు చేశారు. అవినీతిలో భాగస్వాము లైనవారందరిని జైలులో పెట్టడంతో పాటు దుర్వినియోగ మైన నిధులను రాబట్టాలని డిమాండ్ చేశారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం అవినీతిని వెలికి తీయడానికి ఎంత దూరమైనా పోతామని హెచ్చరించారు. అంచాలనాలను తక్కువగా రూపొందించి తర్వాత భారీగా పెంచుకున్నారని అధికారిక స్పష్టం చేస్తున్నాయని అన్నారు.

విద్యార్థిని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

విద్యార్థిని కుటుంబానికి ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ పరామర్శ

- 'గురుకుల' ఘటనలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరపాలి : మల్లు లక్ష్మి

ప్రజాశక్తి- హైదరాబాద్

ఇమాంపేట గురుకులంలో మృతిచెందిన విద్యార్థిని వైష్ణవి కుటుంబాన్ని ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంగళవారం పరామర్శించారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వరుసగా జరుగుతున్న విద్యార్థినుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ కాలనీలో గురుకుల కళాశాల విద్యార్థిని దగ్గుబాటి వైష్ణవి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం మల్లు లక్ష్మి మాట్లాడుతూ..గురుకుల కళాశాలలో వైష్ణవి మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. శరీరంపై గాయాలు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. వైష్ణవి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, స్పష్టమైన ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల ఆత్మహత్యలపై ముఖ్యమంత్రి, స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ బృందంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, సిపిఎం పట్టణ కార్యదర్శి వల్లపుదాస్ సాయికుమార్, నాయకులు మద్దెల జ్యోతి, కోట సృజన, మామిడి సుందరయ్య, అక్కినపల్లి వినయ్, నాగరాజు, రాణమ్మ శశిరేఖ, భిక్షమమ్మ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

తెలుగు భాషా పరిరక్షణకు చిట్టెన్ రాజు విశేష కృషి

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి - కల్చరల్

తెలుగు భాషా పరిరక్షణకు వ్యయంతో పాటు ప్రయాస పడుతున్న చిట్టెన్ రాజు విశేష కృషి చేస్తున్నారని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది దేశాలలో ప్రపంచ తెలుగు మహాసభలు స్వయంగా నిర్వహించడం ప్రభుత్వాలు కూడా చేయలేని పని అయన చేశారన్నారు. భాషా సంస్కృతి పట్ల తమ ప్రేమ అభిమానం అమెరికాలో వుండి చాటుకుంటున్నారని అన్నారు. మంగళవారం శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా త్రిదశాబ్ది వేడుకల సందర్భంగా నాలుగు గ్రంథాల ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా ఆచార్య ఇనాక్ పాల్గొని మాట్లాడుతూ.. పరస్పర సంస్కృతులను సాహిత్యం మాధ్యమంగా మిళితం చేయాలని దీనిద్వారా ప్రపంచ మానవుల పరస్పర అవగాహన కలుగుతుందని చిట్టెన్ రాజు భావన అని వివరించారు. అధ్యక్షత వహించిన చిట్టెన్ రాజు మాట్లాడుతూ.. అమెరికా లో స్థిరపడి ఐదు దశాబ్దాలు గడిచినా తెలుగు భాషవ్యాప్తికి వంగూరి ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. తాను రాస్తూ ఇతరులు రాసిన తెలుగు గ్రంథాలను ప్రచురించి ప్రాచుర్యంలోకి తేవటం లక్ష్యంగా సాగుతోందన్నారు. మార్చిలో ప్రపంచ తెలుగు మహాసభలు కాకినాడలో, నవంబర్‌లో ఖతార్‌లో జరుపుతామని తెలిపారు. శ్రీదేవి మురళీధర్ రచించిన స్వయం సిద్ధ నవలను నటుడు తనికెళ్ల భరణి, ఆవిష్కరించి.. మాట్లాడుతూ నటి రేఖ జీవిత చరిత్ర స్వయం సిద్ధ అత్యుత్తమ జీవిత చరిత్ర అని వివరించారు. వంగూరి చిట్టెన్ రాజు రచించిన అమెరికా కాకర కాయ కథలు, సినీ గీత జొన్నవిత్తుల ఆవిష్కరించి మాట్లాడుతూ.. భాషను కాపాడుకోవాల్సింది భాష అభిమానులు అనీ, రాజకీయ నాయకులు కాదు అని అన్నారు.

కెటిఆర్ బస్సుపై కోడి గుడ్లతో దాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండలో బిఆర్‌ఎస్ తలపెట్టిన మాజీ సిఎం కెసిఆర్ సభతో మంగళవారం కొంత ఉద్రిక్తత ఏర్పడింది. మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు, ప్రస్తుత ఎమ్మెల్యేలు పట్టణంలోని గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాసానికి వచ్చారు. వారికి భోజనం ఏర్పాట్లు చేశారు. అది పూర్తి చేసుకుని సభా స్థలికి బస్సులో వెళ్తున్న సమయంలో ఎన్‌ఎస్‌యుఐ నాయకులు హైదరాబాద్ రోడ్డులోని హోటల్ మనోరమ ముందు అడ్డంగా వెళ్లారు. కెసిఆర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ నల్లటి దుస్తులు ధరించి కోడిగుడ్లతో దాడి చేశారు

సాగర్‌ను సందర్శించిన

నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం

- వారి వెంట ఆంధ్ర, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు
- మూడ్రోజుల పాటు కొనసాగనున్న పరిశీలన

ప్రజాశక్తి- హైదరాబాద్

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు డ్యామ్‌ను మంగళవారం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం పరిశీలించింది. 14, 15వ తేదీల్లోనూ ఈ పరిశీలన కొనసాగ నుంది. బృందం సభ్యులు సోమవారం సాగర్ విజయవిహార్ అతిథి గృహానికి చేరుకున్నారు. వారికి నీటిపారుదల శాఖ ఎస్ఇ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జున్ పలువురు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం విజయ విహార్ అతిథి గృహంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సభ్యులు, సిడబ్ల్యుసి, కృష్ణా రివర్ బోర్డు సభ్యులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇరిగేషన్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. అనంతరం సిడబ్ల్యుసి, కెఆర్‌ఎంబి, ఎపి, తెలంగాణ ఇరు రాష్ట్రాల నీటిపారుల శాఖ అధికారులతో కలిసి సాగర్ ప్రధాన డ్యాం, గేట్లు, గ్యాలరీ, కుడికాలువ, హెడ్ రెగ్యులేటర్, జలవిద్యుత్ కేంద్రం, క్రస్ట్‌గేట్లను, 220, 420 గ్యాలరీలను వాక్‌వే మీద నుంచి స్పిల్‌వేను పరిశీలించారు. నాగార్జునసాగర్ పాజెక్టు జలాశ యం కెఆర్‌ఎంబి పరిధిలోకి తీసుకురానున్న నేపథ్యంలో డ్యాం భద్రత, నీటి నిల్వలు, వినియోగంపై పూర్తిస్థాయిలో నిపుణుల బృందం అధ్యయనం చేసింది. జలాశయం భద్రత, నీటి నిల్వలు, నీటి వినియోగంపై సమగ్రంగా పరిశీలించి సాగర్ డ్యాం జలాశయం వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2009లో వచ్చిన వరదలకు ఎంతమేర నీటి ప్రవాహం వచ్చింది, జలాశయం నుంచి ఎన్ని వేల క్యూసెక్కుల వరదనీరు గేట్ల ద్వారా విడుదల చేశారు..గేట్ల ద్వారా వరదనీరు విడుదల చేస్తున్న సమయంలో ఏమైనా ఇబ్బంది కలిగిందా అంటూ ఆరా తీశారు. డ్యామ్ జలాశయా నికి సంబంధించిన ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు తెలుసుకున్నారు. జలాశయానికి సంబంధించిన గేట్స్, గ్యాలరీ, రోప్స్‌ను పరిశీలించారు. గత నెల 9న కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి నేతృత్వంలో తెలంగాణ, ఎపితో సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమల్లో భాగంగా..సిడబ్ల్యుసి డైరెక్టర్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌డిఎస్ఎ, కెఆర్‌ఎంబి, సిడబ్ల్యుసి ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర నీటుపారుల శాఖకు సంబంధించిన 13 మంది బృందం సభ్యులు జలాశయాన్ని సందర్శించారు. ఎస్‌డిఎస్ఒ చైర్మన్, సిడబ్ల్యుసి డైరెక్టర్ రమేష్ కుమార్, సిఇ ప్రమీల, ఎస్ఇ శ్రీనివాస్, ఇఇ విజయలక్ష్మి, తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు సిఇ విజయ్ కుమార్, ఎస్ఇ నాగేశ్వరరావు, ఇఇ మల్లికార్జున, డిఇ శ్రీనివాస్ రావు, పాపారావు, ఎఇ కృష్ణయ్య, సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ నీటిపారుల శాఖ అధికారులు సిఇ మురళీధర్ రెడ్డి, ఎస్ఇ వరలక్ష్మి, ఇఇ శ్రీహరి, డిఇ మురళీధర్, సిఆర్‌పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్, నాగార్జునసాగర్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, అసిస్టెంట్ కమాండెంట్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శిస్తున్న డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం

కేంద్రం విద్యా విధానాలపై ఉద్యమించాలి

- వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు
- దేశవ్యాప్త సమ్మెకు మద్దతు
- 16న నిరసన ప్రదర్శనలకు పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలపై విద్యార్థి లోకం ఉద్యమించాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. 16న దేశవ్యాప్త గ్రామీణ బంద్, సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. మంగళవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని పిడిఎస్‌యు రాష్ట్ర కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకుల సమావేశం జరిగింది. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు పి మహేష్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పది సంవత్సరాలుగా విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య కాషాయీకరణ, ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ చేస్తూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు ఇవ్వకుండా, స్కాలర్‌షిప్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. విద్యా వ్యాపారీకరణ, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనారిటీలకు సామాజిక న్యాయం దూరం చేసే విధంగా నూతన జాతీయ విద్యావిధానం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భిన్నత్వంలో ఏకత్వానికి బదులు హిందూత్వ రాజ్యాన్ని స్థాపించడానికి బాటలు వేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. 16వ తేదీన సమ్మెలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజాద్, పిడిఎస్‌యువి రాష్ట్ర కార్యదర్శి విజయ్, ఎఐడిఎస్ఒ రాష్ట్ర కార్యదర్శి మల్లేష్, ఎఐఎస్‌బి నాయకులు హకీమ్ నవీద్, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కంచనపల్లి శ్రీనివాస్, అశోక్ రెడ్డి, ప్రవీణ్, గౌతమ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 12 వేల వేతనంతో బతికేదెట్లా?

- కనీస వేతనాల జిఒలలో కొరవడిన శాస్త్రీయత
- 2021లో చెప్పిన బేసిక్ వేతనమే రూ.18,019
- ప్రస్తుత జిఒలలో దానికంటే తగ్గింపు
- వేతనాలకు డిఎపాయింట్లు కలిపి పెంచినట్టు చిత్రీకరణ
- ఈ జిఒలతో యాజమాన్యాలకు లబ్ది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాలుగు రాళ్లు వెనుకేసుకోవడం దేవుడెరుగు.. పెరిగిన నిత్యావసర ధరలు, ఇంటి అద్దెలు, ఇతరత్రా ఖర్చుల నేపథ్యంలో కోర్కెలన్నీ చంపుకుని ఓ చిన్న కుటుంబం (నలుగురు సభ్యులు) నెలంతా నెట్టుకురావాలంటే తక్కువలో తక్కువ రూ.26 వేలు అవసరం. రాష్ట్ర సర్కారు మాత్రం రూ.12 వేలుంటే చాలంటూ కనీస వేతనాల జిఒల (ప్రాథమిక నోటిఫికేషన్లు)ను విడుదల చేసింది. దాన్నిప్రతిపాదించినకార్మిక శాఖ అధికారులుగాని..ఆమోద ముద్ర వేసిన సర్కారు పెద్దలుగానీ నెల కాదు..ఆ వేతనంతో కనీసం పది రోజులైనా బతుకగలుగుతారా? అనే ప్రశ్న కార్మికవర్గం నుంచి వినిపిస్తోంది. కార్మికులు అప్పులు చేసి బతికితే మాకేంటి? తిండి లేక చస్తే మాకేంటి? పరిశ్రమల యాజమాన్యాలకు అధిక లాభాలు గడించిపెట్టడమే తమ లక్ష్యం అన్నట్టుగా రాష్ట్ర సర్కారు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. బిజెపి, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలేవైతేనేం పెట్టుబడి దారీ వర్గ ప్రయోజనాలే ముఖ్యమన్నట్టుగా ముందుకు పోతున్న తరుణంలో కార్మికవర్గం ఐక్యంగా పోరాటాల్లో కదలాల్సిన అవసరం ఆసన్నమైంది.

ఈ ఏడాది జనవరి 29న రాష్ట్రంలో 74 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలకు సంబంధించి 74 ప్రాథమిక నోటిఫికేషన్లను (జిఒ నెం.50 నుండి 123 వరకు) రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 60 రోజుల్లో తమ అభిప్రాయాలను తెలియజేయాలని కార్మిక సంఘాలకు, కార్మికులకు, యాజమాన్య సంఘాలకు సూచించింది. ఈ నోటిఫికేషన్‌లలో గతంలో ఉన్న వేతనాలకు మించి ఒక్క రూపాయి కూడా పెంచలేదు. ఎక్కడైనా ఉన్నదాని కంటే కొంత అదనంగా పెంచి కొత్తవేతనాలను ప్రతిపాదిస్తారు. ఈ ప్రాథమిక సూత్రాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టింది. ఇప్పటికే 2013, 2015లలో ప్రాథమిక నోటిఫికేషన్లు ఇచ్చి 2021 జూన్ 26, 30 తేదీల్లో ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేసిన ఐదు రంగాలకూ రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒకపక్క 2021 జూన్ 30న ఫైనల్ నోటిఫికేషన్లు ఇచ్చిన జిఒ నెం.21,22,23,24,25 లను ఆరు వారాల్లో గెజిట్ చేయాలని 2022 సెప్టెంబర్ తొమ్మిదో తేదీన హైకోర్టు అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా, ఆ సర్కారు బుట్టదాఖలు చేసింది. కోర్టు ధిక్కరణ నేరం కింద హైకోర్టులో ఆ కేసు నడుస్తోంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వీటికీ మళ్లీ ప్రాథమిక నోటిఫికేషన్లు విడుదల చేయడం చట్ట విరుద్ధం.

రూ.26 వేలు లేదు.. రూ.18,019లేదు.. రూ.12 వేలు చాలంట

ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన ఐదు జిఒలను గెజిట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మికవర్గం పోరాడుతోంది. 2021 జూన్ 30న ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్‌లో అన్‌స్కిల్డ్ కార్మికుడికి కనీస వేతనాన్ని నెలకు రూ.18,019గా, అత్యధికంగా నెలకు రూ.39,833 గా చూపెట్టారు. ఆ జిఒ ప్రకారం నేడు అన్‌స్కిల్డ్ వర్కర్‌కి కనీస వేతనం నెలకు రూ.21,223 రావాలి. ఈ రెండున్నరేళ్ల కాలంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి కాబట్టి దాన్ని మరింత పెంచి నోటిఫికేషన్లు విడుదల చేయాలి. కానీ, రాష్ట్ర సర్కారు మాత్రం ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్లలో కనీస వేతనం రూ.11 వేల నుంచి రూ.12 వేలనే పేర్కొంది. బేసిక్ వేతనాన్ని పెంచాల్సింది పోయి ఉన్నదానికంటే ఆరేడు వేల రూపాయలను తగ్గించింది.

నైపుణ్యాల నిర్ధారణేది?

గతంలో ఇచ్చిన ఐదు నోటిఫికేషన్లలో అన్‌స్కిల్డ్, సెమీస్కిల్డ్, స్కిల్డ్, హైలీస్కిల్డ్-1, హైలీస్కిల్డ్-2, హైలీస్కిల్డ్-3, హైలీ స్కిల్డ్-నాలుగు వరకు విభజించి నిర్దిష్టంగా ఏ పని ఏ కేటగిరీ కిందికి వస్తుందో పేర్కొన్నారు. వాటికి సంబంధించి కనీస వేతనాల సలహా మండలిలో చర్చించి 2013, 2017లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి యాజమాన్యాల, కార్మిక సంఘాల అభిప్రాయాలను తీసుకొని సుమారు మూడు నాలుగేళ్ల పాటు సాగదీశారు. సుప్రీంకోర్టు తీర్పు, కనీస వేతన చట్టాన్ని పరిగణలోకి తీసుకొని ఉన్న దాంట్లో శాస్త్రీయంగా వేతనాన్ని విడిఎ రేట్లు నిర్ణయించారు. ఈ ఐదు నోటిఫికేషన్లలో విడిఎ రేటు పాయింట్‌కి అన్‌స్కిల్డ్‌కి రూ.12, సెమీస్కిల్డ్ వర్కర్‌కి రూ.14.41 పైసలు, స్కిల్డ్ వర్కర్‌కి రూ.16.28 పైసలు, హైలీస్కిల్డ్‌లో నైపుణ్యాలను బట్టి రూ.18.93 పైసల నుంచి రూ.26.54 పైసలుగా నిర్ణయించారు. కానీ ఇప్పుడు ఇచ్చిన నోటిఫికేషన్లలో కేవలం అన్‌స్కిల్డ్, సెమీస్కిల్డ్, స్కిల్డ్ భాగాలుగానే చూపెట్టారు. హైలీస్కిల్డ్ వేతనాన్ని కొన్ని జీఓలలోనే పేర్కొన్నారు. ప్రస్తుత ప్రాథమిక నోటిఫికేషన్‌లో అన్‌స్కిల్డ్ వర్కర్‌కి వీడీఏ రూ.6-44 పైసల నుంచి హైలీస్కిల్డ్‌కు రూ.8.17 పైసల వరకే నిర్ణయించటం దారుణం.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి : సిఐటియు

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగా వ్యవహరించ కుండా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను పెంచి కార్మికులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ కోరారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడిదారులను సంతృప్తిపరిచే తన వర్గస్వభా వాన్ని చాటుకుంది. కార్మికుల విషయంలో బిఆర్‌ఎస్‌కు, కాంగ్రెస్‌కు తేడా లేదని స్పష్టమవుతోంది. 2015-16లోనే కనీస బేసిక్ వేతనం రూ.12 వేలు నిర్ణయించారు. ఎనిమిదేళ్ల తర్వాత కూడా అంతే నిర్ణయించడం దారుణం. 2017 తరువాత రూ.18,019 గా నిర్ణయించి ఐదు రంగాలకు ఫైనల్ నోటిఫికేషన్‌ను రాష్ట్ర సర్కారు ఇచ్చినా.. యాజమాన్యాల సంఘాల ఒత్తిడితో గెజిట్ చేయలేదు. వాటిని అమలు చేయాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులనూ తొక్కిపెట్టింది. ఈ ప్రభుత్వం కూడా కోర్టు తీర్పును గాని, కార్మికసంఘాల డిమాండ్‌ను గాని పరిగణలోకి తీసుకోక పోవడం దారుణం. సిఐటియు రాష్ట్ర నాయకత్వం, సిపిఎం రాష్ట్ర నాయకత్వం ముఖ్యమంత్రిని కలిసి కనీస వేతనాలపై వినతి పత్రాలు ఇచ్చినప్పుడు సానుకూలంగా స్పందిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి హామీనిచ్చారు. కానీ, ఆచరణలో రాష్ట్ర ప్రభుత్వం దాన్ని విస్మరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆఘమేఘాల మీద జారీ చేసిన జిఒల వల్ల 1.20 కోట్ల మంది కార్మికులు నష్టపోనున్నారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్ వేతనాలను సవరించి కనీస వేతనాలు పెంచాలి' అని కనీస వేతనాల పెంపు కోసం కార్మికవర్గం పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.

16న సమ్మెకు సంఘీభావంగా ఎల్‌ఐసి ఏజెంట్ల నిరసనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర కార్మిక సంఘాలు-సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా ఎల్‌ఐసి ఏజెంట్లుగా సంఘీభావ కార్యక్రమాలు చేపట్టాలని ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ పిలుపునిచ్చింది. మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్‌ఐఒ బ్రాంచ్‌ల వద్ద యూనియన్ రాష్ట్రనాయకులు ప్రచార క్యాంపెయిన్ నిర్వహించారు. అందులో ఎల్‌ఐసి ఎఒఐ గౌరవాధ్యక్షులు జె.వెంకటేష్, ఎఐఐఇఎ జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య, హైదరాబాద్ డివిజన్ నాయకులు శ్రీనివాస్,



గిరిధర్, మద్దిలేటి తదితరులను ఎల్‌ఐసి ఏజెంట్ల సంఘం ప్రధాన కార్యదర్శి తన్నీరు కుమార్, రాష్ట్ర కార్యదర్శి సంగం వెంకటేశ్వర్లు, హైదరాబాద్ డివిజన్ కన్వీనర్ గూడూరు ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వరంగ పరిరక్షణకు, రైతాంగ సమస్యల పరిష్కారానికి, దేశంలో కోట్లాది శ్రమజీవుల హక్కుల కోసం సాగుతున్న ఈ ఉద్యమానికి ఎఐఐఇఎ అండగా ఉంటుందని ప్రకటించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్, జె.వెంకటేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దేశంలో అవలంబించిన ఆర్థిక విధానాలు, వ్యూహాత్మక అమ్మకాలు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ చర్యలతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు బలహీనపడుతున్నాయన్నారు. ఎల్‌ఐసిలో పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ తక్షణం చేయాలనీ, ఇన్సూరెన్స్ ప్రీమియంపై విధిస్తున్న జిఎస్‌టిని రద్దు చేయాలని, ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారతదేశ స్వావలంబనను బిజెపి ప్రభుత్వం తూట్లు పొడిచిందని విమర్శించారు. ప్రభుత్వ రంగం అంటే కేవలం ఆయా సంస్థల్లో పనిచేసే కార్మికుల ప్రయోజనాల వరకేనని భావించడం సరికాదన్నారు. తన్నీరు కుమార్ మాట్లాడు తూ దేశ మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రజలకు నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు లభ్యమవుతున్న అంశాన్ని విశాల దృష్టితో చూసి ఇన్సూరెన్స్‌తో సహా ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవడం పౌరుల బాధ్యతనీ, ఈ లక్ష్యంతో ఫిబ్రవరి 16న జరగనున్న కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్‌కు ప్రజలు మద్దతునివ్వాలని కోరారు.

మహారాజశ్రీ అవనిగడ్డ సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
E.A. No. 60/2023 in E.P. No. 52/2014 in O.S. No. 59/2007
Between :
KUrapati Dhanalakshmi ... పిటీషనర్ / DHR
And
Kurapati Venkata Ratnam & 8 others
.... రెస్పాండెంట్స్ / JDR
To,
R7 : Kurapati Gnana Venkata Gopinadh, S/o Late Venkata Subba Rao, Hindu, 35 yrs., R/o Plat No. 312, BRS Subhanilayam, Gajula Ramaram, Hyderabad - 500 055.
R8 : Pagolu Lakshmi Chitra, D/o Late Kurapati Venkata Subba Rao, Hindu, 33 yrs., R/o Plat No. 312, BRS Subhanilayam, Gajula Ramaram, Hyderabad - 500 005.
పై నెంబరు గల E.A. No. 60/2023 లో మీకు పై కోర్టువారి నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ మీరు సదరు నోటీసులు పుచ్చుకొనని కారణంచేత ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని కోరారు. ది. 19-2-2024 తేదీకి వాయిదా వేసినారు. కావున మీరు ఆ రోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
అవనిగడ్డ.
మత్తి వెంకటేశ్వరరావు, ఎం.ఎ., బి.ఎల్.,
పిటీషనర్ / డిహెచ్ఆర్ తరపు న్యాయవాది,
అవనిగడ్డ.

ప్రకటన
జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ముమ్మిడివరం
OS.No.115/2022
Between
కొప్పిశెట్టి వెంకటేశ్వర రావు
... పిటీషనర్
మరియు
కొప్పిశెట్టి గణేశ్వరరావు
... రెస్పాండెంట్
To,
కొప్పిశెట్టి గణేశ్వరరావు
S/o. లేటు వెంకటరెడ్డి, హిందువు, ఇనాం 65 సం॥లు
ఇంటి నెం. 4-06/55, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ.
పై నెంబరు దావాలో మీకు నోటీసులు అమలు నిమిత్తం మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ది. 13.03.2024 వ తేదీన పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున దావా విచారించబడునని యిందుమూలముగా తెలియ జేయడమైనది.
అమలాపురం
తేది. 13.02.2024
కుడుపూడి అశోక్,
అడ్వకేట్,

వెంట పడ్తాం... వేటాడ్తాం

- మళ్లీ డబుల్ స్పీడ్‌తో అధికారంలోకి వస్తాం..
- అసెంబ్లీ తీర్మానం సరే.. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి సంపూర్ణమైన నీటి వాటా వచ్చే వరకు కొట్లాడుతాం
- నల్లగొండ బహిరంగ సభలో మాజీ సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కృష్ణా జలాల వాటా వచ్చే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను వెంటపడి వేటాడ్తాం.. అది సాధించే వరకు నిద్రపోనియం.. తెలంగాణ తెచ్చిన కెసిఆర్‌నే తిరగనివ్వరా.. నా కట్టె కాలే వరకు తెలంగాణ కోసం పోరాడుతా.." అని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. కృష్ణాజలాల వాటా సాధన కోసం మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ వద్ద మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో కెసిఆర్ మాట్లాడారు. కృష్ణాజలాల ప్రాజెక్టును కేంద్రానికి అప్పగించడంపై అసెంబ్లీ తీర్మానం చేసిందని, దాంతో సరిపోదని, ఇక అసెంబ్లీ బంజేసి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కృష్ణా ట్రిబ్యునల్ ప్రకారం తెలంగాణకు రావాల్సిన జలాల వాటా వచ్చే వరకు ప్రధానిపై, కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కృష్ణాజలాల వాటా దక్కే విధంగా పోరాడాలన్నారు. కృష్ణాజలాల వాటా కోసం 24 ఏళ్లుగా పోరాడుతున్నానని, తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పటికీ కృష్ణా ట్రిబ్యునల్‌కు లేఖలు రాస్తునే ఉన్నామని చెప్పారు. తన హయాంలో కేంద్రం నుంచి అనేక బెదిరింపులు, ఒత్తిళ్లు వచ్చినా తట్టుకున్నాం.. కానీ కృష్ణాజలాలు అప్పగించలేదన్నారు. చివరకు మోటార్లకు మీటర్లు పెట్టాలని ఒత్తిడి చేసినా ఒప్పుకోలేదన్నారు. సంపూర్ణమైన నీటి వాటా వచ్చే వరకు కొట్లాడుతూనే ఉంటానన్నారు.

కాళేశ్వరం ఒక ఆట బొమ్మ కాదన్నారు. మేడిగడ్డలో ఏముందని, కాళేశ్వరం పెద్ద ప్రాజెక్టు అని అందులో 250 పిల్లర్లు ఉన్నాయని, 1200 కిలోమీటర్లు కాల్వ ఉందని, 19 సబ్‌స్టేషన్లు ఉన్నాయని, 20 రిజర్వాయర్లు ఉన్నాయని చెప్పారు. అన్ని ఉన్నప్పుడు అందులో రెండు మూడు కుంగడం సహజమని, దానిని సరిచేసి నీల్లు ఇవ్వడం వదిలేసి ఏదో తప్పు జరిగిపోయిందని గగ్గోలు పెడుతున్నారని అన్నారు. గతంలో నాగార్జున్‌సాగర్, ఎస్సారెస్పీ, మూసీ ప్రాజెక్టులు కుంగిపోలేదా అని ప్రశ్నించారు. తామూ అసెంబ్లీ అయ్యాక మేడిగడ్డను సందర్శిస్తామన్నారు. అహంకారంతో, దుర్మార్గంతో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. "మీరు అంత మగాళ్లా.. నన్ను చంపి మీరు ఉంటరా.. మీకు అంత దమ్ముందా..రా" అంటూ రాష్ట్ర కాంగ్రెస్ నేతలను హెచ్చరించారు. చేతగాక.. పాలన చేయలేక పొద్దుల్నేస్తే కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రంలో దద్దమ్మల రాజ్యం కొనసాగుతోందని విమర్శించారు. "మేడిగడ్డ బొందల గడ్డకాదు.. కాళేశ్వరంలో నీళ్లు ఉన్నాయి.. మీకు దమ్ముంటే నీళ్లు ఎత్తిపోయండి" అని కేసీఆర్ సవాల్ విసిరారు. నీళ్ల విషయంలో వారికి అవగాహన లేదన్నారు. తెలివిలేకపోతే ఎవరినైనా అడిగి తెలుసుకోవాలని, ప్రతిపక్షంలో తనతోపాటు ఎంతో మంది సీనియర్ నాయకులు ఉన్నారని, కనీసం వారినైనా అడిగి తెలుసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పాలమూరు ఎత్తిపోతల పథకం, సీతారామం ప్రాజెక్టు, గురుకుల పాఠశాలల పెరుగుదల, కరెంట్, మంచినీళ్ల విషయంపై దృష్టిపెట్టి పూర్తి చేయాలన్నారు.

సభలో మాట్లాడుతున్న కెసిఆర్

తాము అధికారంలో ఉన్నప్పుడు 24గంటలు కరెంట్, ఇంటింటికీ మంచినీరు అందించామన్నారు. రైతులకు కరెంట్, నీళ్లు పెట్టుబడి సాయం, సకాలంలో ఎరువుల పంపిణీ, పండించిన పంటను మద్దతు ధరకు కొనుగోలు చేశామని వివరించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి కరెంట్ బంద్ అయ్యిందని, రైతుబంధు ఇంతవరకు ఇవ్వలేదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో జనరేటర్ పెట్టి నడిపించాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఈ మధ్యనే మరో విషయం తెలిసిందని.. ధాన్యానికి మద్దతు ధర వస్తే బోనస్ రూ.500 ఇవ్వబోమని కాంగ్రెస్ చెబుతుందని ఇదేక్కడి దారుణమని అన్నారు. నాడు..నేడు ఎప్పుడూ తెలంగాణ హక్కుల సాధన కోసం కేసీఆర్ పోరాటాలు చేస్తూనే ఉంటాడని, కట్టె కాలేవరకు తెలంగాణ కోసం పోరాడుతానని చెప్పారు. కృష్ణా జలాల హక్కుల సాధన కోసం నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రజలు పోరాడాలని, ఇది ఈ జిల్లాల ప్రజల జీవన్మరణ సమస్యని చెప్పారు. నల్లగొండ సభ కేవలం శ్రీకారమేనని, భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు ఉంటాయని, ఒక్క పిలుపుతోనే తెలంగాణ ప్రజలు తరలి వచ్చి సైనికులుగా ఉద్యమించాలని సూచించారు. ఈ సభలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంపిలు కేశవ రావు, నామ నాగేశ్వర్‌రావు, బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, సబిత ఇంద్రారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు, ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు మృతదేహానికి నివాళులర్పిస్తున్న భట్టి విక్రమార్క

డిప్యూటీ సిఎం భట్టి సోదరుడు మృతి

ప్రజాశక్తి- హైదరాబాద్

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో హైదరాబాద్ ఎఐజి ఆస్పత్రిలో మంగళవారం ఉదయం మృతి చెందారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం గ్రామంలో ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన మల్లు అఖిలాండ దాస్, మాణిక్యమ్మ దంపతుల మూడో సంతానం అయిన వెంకటేశ్వర్లు హోమియోలో ఎండి చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్ డిపార్ట్‌మెంట్‌లో ఆచార్యులుగా, ఆ శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందిన ఆయన ఒకటో వార్డులో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ప్రయివేటుగా వైద్య వృత్తిని కొనసాగించారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కొద్ది రోజుల కిందట హైదరాబాద్ గచ్చిబౌలి ఎఐజి ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయారు. మల్లు వెంకటేశ్వర్లు మరణంతో వారి కుటుంబంలోనూ, లక్ష్మీపురంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రాజెక్టులపై కెసిఆర్ మోసం

- డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్
- నల్లగొండలో కాంగ్రెస్ వినూత్న నిరసన
- ఖాళీ కుర్చీపై పింక్ టవల్, కెసిఆర్ ఫొటో

ప్రజాశక్తి- హైదరాబాద్

పదేళ్ల అధికారంలో ఉన్న కెసిఆర్ ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేయకుండా ప్రజలను మోసం చేసిందని డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ విమర్శించారు. నల్లగొండలో కెసిఆర్ బహిరంగ సభ నేపథ్యంలో నిరసిస్తూ మంగళవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ సెంటర్‌లో వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. ఖాళీ కుర్చీలో పింక్ టవల్ వేసి కెసిఆర్ ఫొటో పెట్టి.. కెసిఆర్ సిఎంగా ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను ఎండగడుతూ ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. కెసిఆర్ గోబ్యాక్ అంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ కెసిఆర్‌వన్నీ దొంగ హామీలని విమర్శించారు. బిఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి శ్రీశైలం టన్నెల్‌ను కిలోమీటర్ కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. డిండి ఎత్తిపోతల, పాలమూరు- రంగారెడ్డి, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయని కెసిఆర్‌కు నల్లగొండలో అడుగుపెట్టే హక్కు లేదన్నారు. పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కుర్చీ వేసుకుని ప్రాజెక్టులు పూర్తి చేస్తానని, దత్తత తీసుకొని నల్లగొండలో అభివృద్ధి చేస్తానని చెప్పి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పిన విధంగా కెసిఆర్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జడ్పిటిసి వంగూరు లక్ష్మయ్య, ఎంపిపి మనిమిద్దె సుమన్, కాంగ్రెస్ పార్టీ తిప్పర్తి మండల అధ్యక్షుడు జూకూరి రమేష్, ఎంపిపి నాగుల వంచ విజయలక్ష్మి, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు నాంపల్లి భాగ్య, నాయకులు నర్సింగ్ శ్రీనివాస్, రేఖల భద్రాద్రి, బషీర్, కరుణాకర్ రెడ్డి, కేసాని వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టోటల్ ఎనర్జీస్‌తో ఎంఐబిఎల్ ఒప్పందం

ముంబయి : వినియోగదారులకు కారు బీమా సేవలను అందించడానికి టోటల్ ఎనర్జీస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు మహీంద్రా ఇన్సూరెన్స్ బ్రోకర్ లిమిటెడ్ (ఎంఐబిఎల్) తెలిపింది. ఈ ఒప్పందం ద్వారా టోటల్ ఎనర్జీస్ క్వార్ట్జ్ ఆటో సర్వీసెస్ వర్క్‌షాప్‌లలో సమగ్ర బీమా సేవలను అందించనున్నట్లు తెలిపింది. దీంతో కారు యాజమానుల బీమా ప్రక్రియను సులభంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. దేశంలోని 235 టోటల్ ఎనర్జీస్ క్వార్ట్జ్‌ల్లో తమ సేవలు లభించనున్నాయని పేర్కొంది.

హృదయ స్పందన పోటీ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - కల్చరల్

కవితలు, నాట్యం, గానం అంశాలలో హృదయ స్పందన పేరిట నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వైఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో ట్రస్ట్ కార్యలయంలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు వై శ్రీరామ్ చంద్ర మూర్తి మాట్లాడుతూ సమిష్టి కుటుంబాలు దేశ ప్రగతి మూలం అని, భారతీయ ఆచార వ్యవహారాలులో ఉమ్మడి కుటుంబంకు ప్రాధాన్యత ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విశ్వ సాహితీ కోశాధికారి, నాట్య గురువు డాక్టర్ కిరణ్మయి మన కళలు సంస్కృతుల గురించి తెలిపారు. విశ్వ సాహితీ స్థాపకుడు పోతుకూచి సాంబ శివరావు స్మారక సాహితీ అవార్డ్స్ కవులకు బహుకరించారు. గాయకులు లక్ష్మీ, రేవతి, ఇందిర, కల్యాణి, మంజుల తదితరులు పాటలతో ఆకట్టు కోగా అనిక , చతుర్య నాట్య అంశాలు ప్రదర్శించారు. సంస్థ సభ్యులు శ్రీదేవి, ప్రకాష్ రావు, సౌజన్య, సహన, రామా గౌడ్ పాల్గొన్నారు.

ముగిసిన నాగోబా జాతర

- బేతాల్, మండ వాజలింగ్ పూజలు
- భుదుండేవ్‌కు పయనం

ప్రజాశక్తి-హైదరాబాద్

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర ముగిసింది. నాగోబా సన్నిధిలో మెస్రం వంశీయులు సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. చివరి రోజున బేతాల్, మండ గాజాలింగ్‌కు పూజలు చేసి జాతరకు వీడ్కోలు పలికారు. తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం మెస్రం ఆడపడుచులు గోవాడ ప్రాంతంలో పటేల్ వెంకట్ రావ్, కుల పెద్దలకు అభిషేకం చేసి బేతాల్ పూజకు ఆహ్వానించారు. వారి సంప్రదాయ వాయిద్యాలను వాయిస్తూ, కుల పెద్దలకు పాదాభివందనం చేశారు. అనంతరం బేతాల్ నృత్యం, మహిళలు, పురుషులు వేర్వేరుగా కర్రసాము ఆడారు. తమ జాతర విజయవంతం అయిందని వారు సంతోష దాయకంగా ఈ బేతాల్ నృత్యం చేస్తారు. అనంతరం నాగోబా ఆవరణలో సందర్శకులు సమర్పించిన పేలాలు, కాయలు ఒక చోటికి పేర్చి మెస్రం వంశీయులకు అందజేశారు. పూజలకు ఉపయోగించిన మట్టి కుండలను మెస్రం ఆడపడుచులకు అందజేశారు. అనంతరం సాయంత్రం వేళల్లో నాగోబా జాతరకు వీడ్కోలు పలికారు. ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్‌లో వెలసిన భుడుం దేవత పూజకు పయనమయ్యారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

- హైదరాబాద్ సిపి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ చరిత్రాత్మక నగరం.. నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉన్న మహానగరంలో లక్షలాది వాహనాలు రోడ్లపైకి వస్తుంటాయి.. ట్రాఫిక్ నియంత్రణలో ఉండాలంటే వాహనదారులందరూ సహకరించాలి.. అప్పుడే అది సాధ్యమవుతుందని హైదరాబాద సిపి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళ వారం హైదరాబాద్ గుడిమల్కాపూర్‌లోని కింగ్ ప్యాలెస్‌లో ఆటో డ్రైవర్లు, వాకర్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు జె సిద్ధు (డిజె టిల్లు), నగర సిపి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. అందరికీ ఎమర్జెన్సీ ఉంటుందని, అందరూ తొందరగా వెళ్లాలనుకుంటే వీలు కాదని, ముందుగా బయల్దేరిన వారే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకుంటారని తెలిపారు. చాలామంది అడ్డదిడ్డంగా వాహనాలు నడిపిస్తున్నారని, అందులో అధిక సంఖ్యలో యువత ఉంటోందన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో అమాయకులు ప్రాణం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి దండ్రులు చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ కంట్రోల్ చెయ్యాల్సిన బాధ్యత సిటీ పోలీసులపై ఉందని, దానికి మీ వంతు సహాయ సహకారాలుంటేనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడిపితేనే ట్రాఫిక్ కంట్రోల్‌లో ఉంటుందన్నారు.

అదనపు సిపి (ట్రాఫిక్) విశ్వప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. నో పార్కింగ్, రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రహదారి భద్రతా నియమాలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ రోజు నేను జీవించి ఉన్నానంటే ఆ హెల్మెట్టే కారణం: డిజె టిల్లూ

"నేను ఇంజినీరింగ్ చదువుకునే రోజుల్లో పరిక్ష రాసి బైక్‌పై వస్తున్నాం.. నాతోపాటు మా కాలేజీ వాళ్లు వెనుక నుంచి స్పీడ్‌గా వచ్చి నా బైక్‌ను ఓవర్‌టేక్ చేసే సమయంలో మా రెండు వాహనాల హ్యాండిల్స్ తగలడంతో మేము పడిపోయాం. ఆ సమయంలో నా హెల్మెట్ కొంచెం విరిగిపోయింది. కొంచెం పగిలిన ఆ హెల్మెట్‌ను చూస్తే భయం వేసింది. ఆ హెల్మెట్టే నా తలలా ఊహించుకున్నాను. మరోసారి రాజమండ్రి నుంచి ముగ్గురం కలిసి 120 స్పీడ్‌లో కారులో వస్తుండగా ఎదురుగా బైక్ రావడంతో దాన్ని తప్పించబోయి బ్రేక్ కొట్టడంతో కారు బోల్తాకొట్టింది. మేము సీటు బెల్టు పెట్టుకోవడంతో చిన్న గీత పడకుండా బయటపడ్డాం. ప్రభుత్వం ట్రాఫిక్ రూల్స్ పెట్టేది" ఈ కార్యక్రమంలో నగర ట్రాఫిక్-1 డిసిపి ఎల్ సుబ్బారాయుడు, ట్రాఫిక్-2 డిసిపి ఎన్ అశోక్‌కుమార్, సికింద్రాబాద్‌లోని రోటరీక్లబ్ గవర్నర్ డాక్టర్ బి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గాలిమాటలు వద్దు.. నిజమేంటో నిరూపించాలి

- దమ్ముంటే మేడిగడ్డ బ్యారేజీ సబ్‌కాంట్రాక్టు ఎవరికిచ్చారో తేల్చాలి
- బండి సంజయ్ నోటికి ఏదొస్తే అది మాట్లాడొద్దు : బోయినపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్

మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో ఎల్అండ్‌టి సంస్థను తాను బెదిరించడంతో తన బంధువులకు సబ్‌కాంట్రాక్టు ఇచ్చిందని గాలి మాటలు మాట్లాడొద్దని, నిజమేంటో నిరూపించాలని ఎంపి బండి సంజయ్‌కి కరీంనగర్ మాజీ ఎంపి వినోద్‌కుమార్ సవాల్ విసిరారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వినోద్‌కుమార్ మాట్లాడారు. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తే ప్రజలు పట్టించుకోరన్నారు. ఎల్అండ్‌టి సంస్థ మేడిగడ్డ సబ్ కాంట్రాక్టు ఎవరికి ఇచ్చిందో తెలిస్తే.. పేరు బయట పెట్టాలని, అసలు మాజీ ఎంపి ఎవరో?, అతడి బంధువులు ఎవరో? సూటిగా చెప్పాలన్నారు. తాను 2014 నుంచి 2019 వరకు ఎంపిగా ఉన్నానని, అంతకు ముందు పొన్నం ప్రభాకర్, కెసిఆర్, చెన్నమనేని విద్యాసాగర్‌రావు, ఎల్ రమణ ఎంపిలుగా ఉన్నారని, ఇందులో ఎవరి బంధువులకు మేడిగడ్డ బ్యారేజ్ సబ్ కాంట్రాక్టు ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ఎంపిగా గెలిచి ఐదేళ్లు అవుతున్నా ప్రజలు గుర్తుకురాని బండి సంజయ్‌కి.. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తుండటంతో గుర్తొచ్చారా అని ఎద్దేవా చేశారు. ఐదేళ్లలో ఐదు కొత్తలు తేలేదని, ఇప్పుడు ఏ మొఖం పెట్టుకుని పాదయాత్ర చేస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం, హరితహారం, నేషనల్ హెల్త్ మిషన్ వంటి పథకాలకు కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకూ ఇచ్చినట్టుగానే తెలంగాణకు ఇచ్చిందని, ఇవన్నీ తన నిధులేనని బండి సంజయ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎప్పుడూ మతం ముసుగులో రాజకీయం చేస్తూ కుల, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాలకు నయాపైసా తెచ్చిన మొఖం లేదని అన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిన విషయంలో జ్యుడీషియల్ విచారణ జరిపితే అభ్యంతరంలేదని గతంలోనే తమ పార్టీ స్పష్టం చేసిందని వివరించారు. సమావేశంలో బిఆర్ఎస్ నాయకుల హామీద్ గంగాధర్ ఎంపిపి శ్రీరాం, జక్కుల నాగరాజు, గవ్వ వంశీదర్‌రెడ్డి దూలం సంపత్, గందెకల్పన, వోల్లాల శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్ కుమార్

జెఇఇ మెయిన్‌లో ఆకాశ్ బైజూస్ విద్యార్థి రిషి శేఖర్ శుక్లా టాప్

హైదరాబాద్ : జెఇఇ మెయిన్స్ 2024 మొదటి సెషన్‌లో హైదరాబాద్‌కు చెందిన ఆకాష్ బైజూస్ విద్యార్థి రిషి శేఖర్ శుక్లా 100 పర్సంటైల్ సాధించారని ఆ సంస్థ తెలిపింది. అతను సాధించిన ఈ విజయం జాతీయంగా, తెలంగాణ రాష్ట్రంలో ఇన్స్ట్యూట్ పరంగా అత్యధిక స్కోరర్‌గా నిలబెట్టడమే కాకుండా దేశంలోని అత్యంత కఠినమైన పోటీ పరీక్షలలో ఒకటైన జెఇఇ టాప్ స్కోరర్‌గా నిలవటంలో అతని తిరుగులేని నిబద్ధతకు నిదర్శమని ఆకాష్ బైజూస్ రీజనల్ డైరెక్టర్ ధీరజ్ మిశ్రా పేర్కొన్నారు. విద్యార్థులకు సమగ్ర కోచింగ్, వినూత్న అభ్యాస పరిష్కారాలతో సాధికారత కల్పించేందుకు, తద్వారా పోటీ పరీక్షల్లో రాణించేలా చేయడంలో ఆకాష్ బైజూస్ నిబద్ధతను ఉదాహరిస్తోందన్నారు.

'ప్రత్యేక' పరీక్ష..!

- ప్రత్యేకాధికారులదే పంచాయతీల బాధ్యత
- ఇప్పటికే సొంత శాఖ పనులతో సతమతం
- వేసవిలో నీటి కష్టాలు తీర్చే బాధ్యతా వీరిదే..
- ఇంటి పన్నుల వసూళ్ల భారం
- పారిశుధ్య పనులు సైతం వీరికే..

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులకు గ్రామ పంచాయతీల బాధ్యతలను అప్పగించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత జిపి ఎలక్షన్స్ నిర్వహించనున్న నేపథ్యంలో అప్పటి వరకు పల్లె పాలన బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులకు పరీక్ష కాలంగా మారింది. ఇంటి పన్నుల వసూళ్లు.. వేసవి తాగునీటి ఎద్దడి.. పచ్చదనం పరిశుభ్రత.. పంచాయతీల నిర్వహణ.. వంటి బాధ్యతలను మోస్తూనే సొంత శాఖ పనులను చక్కబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో గెజిటెడ్ అధికారులను ఆయా గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు. వీరంతా ఈ నెల 2 తేదీ నుంచి సర్పంచుల పనులు చేపట్టారు. కాగా ఇప్పటికే జిల్లాలో పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అంటే బాధ్యతలు చేపట్టగానే ప్రత్యేకాధికారులు ఈ పనులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటికే పలు గ్రామాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ కొన్ని గ్రామాల్లో సక్రమంగా జరగడం లేదు. మరికొన్ని పంచాయతీలు అస్తవ్యస్తంగా మారాయి. ఇలాంటి పరిస్థితిలో పారిశుధ్య పనులు చేయించడం ప్రత్యేకాధికారులకు సవాల్‌గానే మారనుంది.

పన్నుల వసూళ్ల తంటా..

ఇంతకాలం ఇంటి పన్నుల వసూళ్ల విషయంలో అధికశాతం సర్పంచులు నిర్లక్ష్యం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి వివిధ పన్నుల రూపంలో రూ.26.60 కోట్లు వసూలు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ సర్పంచులు వసూలు చేసింది రూ.15.48 కోట్లు మాత్రమే. మిగిలిన దాదాపు రూ.తొమ్మిది కోట్ల పన్ను వసూళ్ల బాధ్యత ప్రత్యేకాధికారులు తీసుకోవాల్సి ఉంటుంది. ఒక వైపు రాజకీయ ఒత్తిడి, మరోవైపు టార్గెట్ పూర్తి చేయాలని అధికారుల ఆదేశాల నేపథ్యంలో మార్చి చివరి నాటికి పన్నుల వసూళ్ల టాస్క్ నెరవేర్చడం కష్టతరమే అంటున్నారు కొందరు ప్రత్యేకాధికారులు. దీనికితోడు వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తీర్చడం కీలకంగా మారింది. ఇప్పుడు మిషన్ భగీరథ పథకం ద్వారా అత్యధిక శాతం గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. కానీ అక్కడక్కడ పలు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఉన్నాయి. వేసవిలో మోటార్లు చెడిపోవడం, పైపులైన్ల లీకేజీలు, బోర్లు పని చేయకపోవడం వంటి సమస్యలను ప్రత్యేకాధికారులు అధిగమించాల్సి ఉంటుంది.

పల్లెపాలనతో సంబంధం లేని శాఖలు

ప్రభుత్వం గతంలో మాదిరి పంచాయతీరాజ్‌శాఖ నుంచే కాకుండా ఇతర శాఖల అధికారులను సైతం ప్రత్యేక అధికారులుగా నియమించింది. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఆర్అండ్‌బి, జలవనరుల శాఖ, మున్సిపల్, వ్యవసాయం, ఉద్యానవన, పశు సంవర్థకతోపాటు ఇతర శాఖల అధికారులు ఇందులో ఉన్నారు. అనుభవం లేని అధికారులు ఈ బాధ్యతలను నిర్వహించాలంటే కొంత సవాలేనని చెబుతున్నారు. దీనికితోడు 2018లో పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేశాక పంచాయతీల బాధ్యతలు మరింత పెరిగాయి. ప్రజలకు మెరుగైన పాలన అందించాలంటే క్రమం తప్పకుండా గ్రామ పంచాయతీని సందర్శించి రోజువారీ పనులను పర్యవేక్షించాలి. అలాంటప్పుడు మాతృశాఖలో విధులు నిర్వర్తించడం ఎలా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఒక్కొక్క అధికారికి రెండు, మూడు పంచాయతీల బాధ్యతలను అప్పగించడంతో కొసరు పని కోసం అసలు పని ఆగిపోయే ప్రమాదం లేకపోలేదు.

అనేక బాధ్యతలు..

ప్రత్యేకాధికారులు రెండు నెలలకోసారి గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రధానంగా పల్లెల్లో పచ్చదనాన్ని పెంచడానికి నర్సరీల ఏర్పాటు, మొక్కలు నాటించి సంరక్షించడం, ఉపాధి పనులు, రికార్డుల నిర్వాహణ, పారిశుధ్యం, తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలి. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల కట్టడికి, సిబ్బంది జీత భత్యాలు, పన్నుల వసూళ్లు, విషజ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వంటివి కీలకంగా ఉంటాయి. పలు ఇతర శాఖల్లో పని చేస్తూ ప్రత్యేకాధికారులుగా నియమితులైన వారు ప్రజా సమస్యల పరిష్కారంలో ఏ మేరకు విజయవంతం అవుతారో తేలాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే..!

ప్రొ ఆదినారాయణ అంత్యక్రియలు పూర్తి

చెకుముఖి తాతకు పలువురి నివాళులు..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జెవివి రాష్ట్ర మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం ఆదినారాయణ అంత్యక్రియలు మంగళవారం పూర్తయ్యాయి. ఆయన ఆదివారం తెల్లవారుజామున మృతిచెందిన విషయం విదితమే. హైదరాబాద్ తార్నాకలోని కిమితి కాలనీలో ఆయన నివాసం నుంచి మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో మృతదేహాన్ని మల్లాపూర్ శ్మశాన వాటికకు తరలించారు. ఆదినారాయణ కుమారుడు అశోక్ అంత్యక్రియలు చేశారు. అంతకుముందు పలువురు జెవివి నేతలు, ప్రజా సంఘాల నాయకులు, ఒయు సైన్స్ కళాశాల ప్రొఫెసర్లు ఆదినారాయణ మృతదేహానికి నివాళ్లర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయనతో ఉన్న గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నివాళ్లర్పించిన వారిలో సిసిఎంబి మాజీ డైరెక్టర్ డా మోహన్‌రావు, జెవివి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, కోశాధికారి రావుల వరప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రాజా, రాష్ట్ర నాయకులు జితేందర్, చెలిమెల రాజేశ్వర్, జెవివి హైదరాబాద్ నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖరరావు, లింగస్వామి, ఔట అధ్యక్షుడు ప్రొ మనోహర్ తదితరులు ఉన్నారు.